# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ స్వచ్ఛత పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.
- ❖ రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
- ❖ దేశంలో సహకార రంగాన్ని క్షేత్ర స్థాయిలో మరింతగా విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు.
- ❖ క్రీడలు ఒక ప్రజా ఉద్యమంగా మారాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.
- ❖ వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం.. ఖర్చులను తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

========================

స్వచ్ఛత పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2024-25 విజేతలకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... భారతీయ జీవన శైలిలోనే స్వచ్ఛత ఉందని గుర్తు చేశారు. ప్రాచీన కాలంలోనే అనేక నగరాలు దీనిని అలవరచుకున్నాయని చెప్పారు. పరిశుభ్రత మీద ప్రజలకు మరింత అవగాహన అవసరమని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

ఇదిలా ఉండగా, దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరం వరుసగా ఎనిమిదో ఏడాది ఎంపికయ్యింది. ఇక, రెండో స్వచ్ఛమైన నగరంగా సూరత్, మూడో స్థానంలో ముంబయి మహానగరం నిలిచింది. అదే విధంగా కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ లోని ఐదు నగరాలకు చోటు దక్కింది. విశాఖపట్నం జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డు దక్కించుకుంది.

========================

రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పీఎం ధన్-ధాన్య కృషి యోజన ఆ లక్ష్యం వైపు సాగేందుకు మరో కీలకమైన అడుగు అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వ్యవసాయ రంగంలో వెనుకబడిన జిల్లాల్లో పంట ఉత్పత్తిని పెంచడమే కాకుండా ఆహార సరఫరాదారుల ఆదాయాన్ని కూడా పెంచుతుందన్నారు. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరం నుండి 100 జిల్లాల్లో 6 సంవత్సరాల పాటు పీఎం ధన్-ధాన్య కృషి యోజనను అమలు చేయాలని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించే మొట్టమొదటి పథకంగా పీఎం ధన్-ధాన్య కృషి యోజనను రూపొందించారు.

========================

దేశంలో సహకార రంగాన్ని క్షేత్ర స్థాయిలో మరింతగా విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్ సమీపంలో జరుగుతున్న సహకార ఉత్సవాల్లో ఈ రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి గ్రామంలోని పేదలకు, రైతులకు సహకారాన్ని విస్తరించే లక్ష్యంతో సహకార మంత్రిత్వ శాఖ పని చేస్తోందని అన్నారు. 98 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో సహకార రంగం చురుకైన పాత్ర పోషిస్తోందని చెప్పారు. దేశంలో సహకార రంగం మరింతగా అభివృద్ధి చెందుతోందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

ఈ సంవత్సరం చివరి నాటికి దేశంలో రవాణా రంగంపైన ఖర్చు తొమ్మిది శాతానికి తగ్గుతుందని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రవాణా ఖర్చు తగ్గింపు వల్ల భారతదేశ ఎగుమతులు 1.5 రెట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. పెరిగిన ఎగుమతుల ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కాగా, గాలి, ధ్వని, నీరు, శిలాజ ఇంధన కాలుష్యం నుండి భారతదేశాన్ని విముక్తి చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం పని చేస్తోందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

విరామం

========================

క్రీడలు ఒక ప్రజా ఉద్యమంగా మారాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కోరారు. అందరూ కలిసి పని చేస్తేనే ఆశించిన లక్ష్యాలను సాధించగలమని పేర్కొన్నారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన “खेल भारत” కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 2047 నాటికి క్రీడలలో భారతదేశాన్ని ప్రపంచంలో నే అగ్ర స్థానంలో నిలబెట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో క్రీడా సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు ప్రధాన పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశ శక్తి క్రీడలలో ఉందని దీనిని అంతర్జాతీయంగా చాటాలని కేంద్ర మంత్రి సూచిస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

========================

కేరళకి చెందిన నర్స్ నిమిష ప్రియ వ్యవహారం సున్నితమైన అంశమని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ విషయంలో పరిష్కారం కోసం యెమెన్ అధికార వర్గాలతో పాటు స్నేహపూర్వక దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. తాము నిరంతరం జరుపుతున్న దౌత్యం వల్లే ఆమె ఉరిశిక్ష వాయిదా పడిందని ఆయన పేర్కొన్నారు. కాగా, నిమిష ప్రియ కుటుంబానికి, యెమన్‌కు చెందిన బాధిత కుటుంబానికి మధ్య పరస్పర అంగీకార యోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు చర్చలు జరుపుతున్నామని రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

=========================

దేశంలో పౌరులకు పెద్దగా ఉపయోగపడని వందలాది నిబంధనలను ప్రభుత్వం తొలగించిందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. 'సుపరిపాలన పద్ధతులు' అనే అంశంపైన భువనేశ్వర్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును ఈ రోజు నుండి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పారదర్శకత, అవినీతి నిరోధక చర్యలతో పాటు క్రమబద్ధీకరించిన పరిపాలన ద్వారానే పౌరులకు ఉత్తమ సేవలు అందించగలమని ఆయన పేర్కొన్నారు.

=========================

ప్రధానమంత్రి కృషి ధన్-ధాన్య యోజన ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి దోహదపడాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధన సంస్థలకు విజ్ఞప్తి చేశారు. బీహార్ సమస్తిపూర్‌లోని పూసాలో ఉన్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ నాలుగవ స్నాతకోత్సవంలో ఈరోజు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి ఈ పథకం కింద 100 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని పేర్కొన్నారు. బీహార్‌లోని జిల్లాలను కూడా కృషి ధన్-ధాన్య యోజన కింద చేర్చినట్లుగా తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం.. ఖర్చులను తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 15 సెకన్లు)

=========================

భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ పై విజయం సాధించాడు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ఫ్రీ స్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ఈరోజు కార్ల్‌సన్ను సునాయాసంగా ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

=========================

మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే మూడు రోజులలో భారీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

=========================
=========================